






సంక్షేమమే గెలుపుమంత్రం

- చేసిన మంచిని చెప్పి తీర్పు కోరదాం
- ఇంటింటికీ వెళ్దాం.. జయకేతనం ఎగురవేద్దాం
- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి
- ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం



గుంటూరు పశ్చిమ సమావేశంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరిగి విజయాన్ని చేకూర్చుతుందని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. ఆదివారం చంద్రమౌళీనగర్‌లోని మాజేటిరామ్ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోను ప్రమాణపత్రంగా భావించి, ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రజలకు చేసిన మంచిని చెప్పుకుని వారి తీర్పు కోరదామని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక పాలన అందిస్తున్నారని ప్రశంసించారు. 30 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇచ్చిన సీఎం దేశంలో ఒక్క జగన్ మాత్రమేనని పేర్కొన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 12.50 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకురావడంలో ఆయన చేసిన కృషి అనన్యసామాన్యమన్నారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి చేపడుతున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి, చేసిన మంచిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేని గత పాలకులు

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో తమ పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్న టీడీపీ, రాజకీయ పరిజ్ఞానం లేని జనసేనను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ప్రజలకు చేసిన మేలుతోపాటు రాష్ట్ర భవిష్యత్తు కోసం సీఎం వైఎస్ జగన్ శాశ్వత ప్రణాళికల గురించి ఇంటింటికీ వెళ్లి చెప్పడంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని పట్టించుకోవద్దని పార్టీ కేడర్‌కు వివరించారు.

ప్యాకేజీ స్టార్‌తో టీడీపీ గిమ్మిక్కులు

గుంటూరు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలిసి వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని గిమ్మిక్కులు చేస్తున్న టీడీపీ నేతలు వీధి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. జైల్లో ఉన్న చంద్రబాబుకు మద్దతు పేరుతో టీడీపీ చేస్తున్న కార్యక్రమాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ సామాజిక న్యాయమే నినాదంగా పేద ప్రజల పక్షాన నిలిచి ప్రజా రంజక పాలన సాగిస్తోందని స్పష్టం చేశారు. కాపు సామాజిక వర్గం కోసం పోరాడిన ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని చంద్రబాబు ప్రభుత్వం హింసించినప్పుడు నోరు మెదపని పవన్ బాబును అరెస్టు చేయగానే హడావుడి చేస్తూ ప్యాకేజీకి తగు న్యాయం చేశారని ఎద్దేవా చేశారు.

ఇంటింటికీ సగర్వంగా వెళ్దాం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ నవంబర్ ఒకటి నుంచి ప్రారంభమవుతున్న "వై ఏపీ నీడ్స్ జగన్" కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. మంచి చేస్తేనే తిరిగి ఓటు వేయాలని ధైర్యంగా చెప్పిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్ సారథ్యంలో ప్రజల వద్దకు సగర్వంగా వెళతామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, నూనె ఉమామహేశ్వరరెడ్డి, చక్రపాణి, ముంతాజ్ పఠాన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం, నిత్యావసర కిట్ల పంపిణీ

నగరంపాలెం: వృద్ధులు, దివ్యాంగుల్ని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కొత్తపేటలోని కార్యాలయంలో ఆదివారం యాభై మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర కిట్లతో పాటు మహిళలకు చీరల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరి శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, ఎస్.విజయలక్ష్మి, తాటికోల పద్మావతి పాల్గొన్నారు.



కనకదుర్గమ్మకు నృత్య నీరాజనం



నృత్యకారిణులతో నాట్యగురువు అనుశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిమనీనగర్‌లో స్నేహమిత్ర ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. శ్రీనగర్‌కు చెందిన అను డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణుల బృందం నాట్య గురువు అనుశేఖర్ పర్యవేక్షణలోనృత్య ప్రదర్శనలు ఆద్యంతం భక్తితన్మయత్వంలో ఓలలాడించాయి.

వైఎస్సార్ సీపీలో చేరికలు

పట్నంబజారు: నగరంలోని 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కల మారుతి, కోటి లింగారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేత గురుబ్రహ్మాచారి నేతృత్వంలో టీడీపీ, బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. బృందావన్ గార్డెన్స్‌లోని విప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తదితరులతో కలసి శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కురుక్షేత్రానికి సమయం ఆసన్నమైందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలే పునాదిగా.. ఒకే మాటగా.. ఒకే బాటగా.. ఇక కదన రంగంలో దూకడమే మనందరి ముందున్న తక్షణ కర్తవ్యమని చెప్పారు. అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని ప్రతి ఒక్కరం ఇంటింటికీ పార్టీ జెండా భుజాన మోసుకు తిరుగుతూ సగర్వంగా సమాధానం చెప్పాల్సిన తరుణం ఇదేనని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు వర్సెస్ పెత్తందారులుగా పరిస్థితి మారిపోయిందన్నారు. పేదల పక్షాన ఒంటరి పోరాటానికి సిద్ధమైన సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు మాట్లాడుతూ సీఎంగా వై.ఎస్. జగన్ ప్రవేశ పెట్టిన పథకాలకు ప్రజలతో పాటు అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం



కోదండపాణి, పద్మావతిని సత్కరిస్తున్న ఆర్య సమాజం సభ్యులు

పాత గుంటూరు: అరండల్‌పేట ఆర్య సమాజం ప్రాంగణంలో పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైదిక ధర్మ ప్రచారకులు డాక్టర్ కొసరాజు రవీంద్ర, మాగం కృష్ణమూర్తి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి. కామేశ్వర రావు, ప్రచారకులు నాగభైరవ గంగా పార్వతి, కూరపాటి కల్యాణి రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం వైదిక ధర్మ ప్రచారకులు జి. కోదండ పాణికి ఆర్య పురుష బిరుదు, ప్రొద్దుటూరు ఆర్య సమాజం నిర్వాహకురాలు బి. పద్మావతికి ఆర్యమాత బిరుదు, నగదు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్య సమాజం అధ్యక్షురాలు గుర్రం నిర్మలాదేవి, వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరి సూర్యనారాయణ, కార్యదర్శి వాసిరెడ్డి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

స్పందన రద్దు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని దసరా పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజలకు ఆమె దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

















